కథ

# మనస్థత్వాలు

- బి.ఎన్. మాధవి

నాకు ప్రకృతి అంటే యిష్టం. పిల్లలన్నా, వారి కల్మష రహితమైన మనసులన్నా యిష్టం. అందుకే, ఎంతో చదువుకున్నా ఉద్యోగం దొరక్క బాధపడుతూ, ఆ బాధ మరిచిపోవడానికి, మా యిద్దరన్నయ్యల పిల్లలతో ఆడుతూంటాను, వదినలు ఎగతాళి చేసినా సరే!

"అడ్డగాడిదలా పెరిగావు ఈ ఆటలేమిట్రా? ఇక పెళ్ళి చేసుకో. నీకు పిల్లనిస్తామని వచ్చినాయనకి బాగా పలుకుబడి వుందిట. వాళ్ళే ఏదైనా ఉద్యోగం యిప్పిస్తారుట" అన్నాడు అన్నయ్య.

ఆ మాట నా మనసును గాయపర్చింది. ఉద్యోగం నేను సంపాదించుకోలేనా? నా చదువుకి, తెలివితేటలకి ఉద్యోగం రాదా? ఎవరో యిప్పించడమెందుకు? అనిపించింది. అమ్మానాన్నలకు నాకిప్పుడే పెళ్ళి చేయాలని లేదని నాకు తెలుసు. మరి అన్నయ్యలెందుకు యింత తొందరపడుతున్నారో నాకర్థం కావట్లేదు.

పెద్ద వదిన పిల్లాడికి స్నానం చేయిస్తూ, వీపు వాచేలా కొట్టి "పిల్లలు పల్లెటూర్లో చెడిపోతున్నారు. సిటీకెళ్ళి చదివిద్దామంటే, ఆయనేం పట్టించుకోరు" అంటూ విసుక్కుంటోంది. ఎప్పుడూ యింటి విషయాల్ని అంతగా పట్టించుకోని నేను మొదటిసారిగా ఆలోచించడం మొదలుపెట్టాను.

ఒకరోజు ఉద్యోగం కోసం తిరిగి తిరిగి యింటికి వచ్చి నా గదిలో కాఫీ తాగుతున్నాను. హాలులో నుంచి మాటలు వినబడుతున్నాయి.

"వాళ్ళదగ్గర్నుంచి మళ్ళీ ఉత్తరం వచ్చిందిరా!" అంటున్నాడు నాన్న పెద్దన్నయ్యతో.

"వచ్చింది. మరింకేం, ఒకసారెళ్ళి చూసి వచ్చి, అంగీకరిస్తే సరి! వాళ్ళు లక్షదాకా కట్నం యిస్తారుట."

"ఇస్తారు సరే! పెళ్ళికి డబ్బు ఎక్కడనుంచి తీసుకురాను. రిటైర్ అయినప్పట్నుంచి చేతిలో సరిగా డబ్బు వుండటం లేదు. మీకు తెలియనిదేముంది?" అన్నాడు నాన్న ఆవేదనగా.

"పెళ్ళికి నీ డబ్బెందుకు? మా పెళ్ళిళ్ళు నీ డబ్బుతోనే చేశావా? కట్నం డబ్బుతో చెయ్యి. వాళ్ళు లక్ష యిస్తే పెళ్ళి ఖర్చంతా పోగా ముప్ఫై వేలన్నా మిగులుతాయి. ఇంకా మాకన్న వాడే నయం, ముప్ఫై వేలు మిగులుతాయి" అన్నాడన్నయ్య.

ఈ సంభాషణంతా విన్న పెద్ద వదిన వచ్చి, "రఘు ఇప్పటివరకు ఏం సంపాదించాడని? ఇప్పటిదాకా చదువుతోనే సరిపోయింది. మా ఆయనొక్కడే గవర్నమెంటు ఉద్యోగం చేస్తున్నారు. లేకపోతే ఈ ఇల్లు ఎలా గడిచేది?" అంది, వాళ్ళయనే యిల్లంతా నడిపిస్తున్నట్లు.

"అలా ఐతే, ఇంతకాలం నుంచి మనకున్న మూడెకరాల పొలం సాగుచేసి వడ్లు పండిస్తున్నాను. లేకపోతే ఈపాటికి కూటికి కూడా యిబ్బందిపడేవాళ్ళం" అన్నాడు రెండో అన్నయ్య, అతను పండించనదే మేమంతా ఆకలితో మాడి చస్తామన్న ధీమా వెలిబుచ్చుతూ.

నాన్న మౌనంగా వుండిపోయారు.

"ఇంతకీ వాడేమంటున్నాడు? చేసుకోనంటున్నాడా?" అంటూ రెట్టించారన్నయ్యలు.

"ఏమో! వాడినే అడిగి తెలుసుకోండి" అన్నారు నాన్న.

గదిలో వున్న నాకు అన్నయ్యల మీద చిర్రెత్తుకొచ్చింది, ఎవరికివారే ఈ యిల్లు తమవల్లే నడుస్తోందని, యింత ఎదిగిందని అనుకుంటున్నారు గాని, నాన్న పూర్తి జీతం ఖర్చయిపోయి అప్పులు ఎందుకు మిగులుతున్నాయని ఎవరు ఆలోచించటం లేదు. ఈమధ్య నా విషయం తేవటం అమ్మా నాన్నను పీడించటం ఎక్కువయింది. నాకు పిలుపొచ్చింది. వెళ్ళగానే - "ఏరా అమ్మాయిని చూసొద్దామా?" అనడిగారు ఇద్దరన్నయ్యలూ.

నేనేమీ మాట్లాడలేదు. మళ్ళీ అడిగారు - నేను ఆలోచిస్తూ వున్నాను. "నోరు లేదా? ఏదో ఒకటి చెప్పు" అన్నాడు చిన్నన్నయ్య.

వాళ్ళు నా పెళ్ళినెందుకు అంత సీరియస్‌గా తీసుకుంటున్నారో అర్థం కాలేదు. కాని, బాధనిపించింది.

"నేను చేసుకోను" కొంచెం సీరియస్‌గానే చెప్పాను.

"ఇంకెప్పుడు చేసుకుంటావ్? లక్ష కన్నా ఎక్కువ ఎవరూ యివ్వరు. ఏమనుకుంటున్నావ్?" అన్నారు.

"ఉద్యోగమొచ్చాక" అన్నాను.

అందరూ ఎగతాళిగా నవ్వారు. నాకు అవమానంగా తోచి అక్కడినుంచి చరచరా నడుచుకుంటూ బయటికెళ్ళిపోయాను. ఎక్కడెక్కడో తిరిగి రాత్రికి యిల్లు చేరాను.

అంతా తిన్నాక, నేను అన్నం తినడానికి కూర్చున్నాను. అన్నం పెడుతూ అమ్మ అన్నది - "నువ్వు పెళ్ళి చేసుకోరా" అని.

"ఇంక రెండేళ్ళ వరకూ చేసుకోదలచుకోలేదమ్మా?" అని చెప్పాను. అన్నం తిని లేచి వెళుతూ వుంటే పోపుల డబ్బా దులిపి చిల్లర పైసలు యిస్తూ చెప్పింది - "ఇంట్లో రెండు రోజుల్నుంచి తమలపాకులు లేవు. మీ నాన్న దగ్గర పైసా లేదు. ఎవరు తెస్తారు చెప్పు, కొంచెం కొనుక్కొచ్చి పెట్టు నాయనా!" అని.

మనసు బాధగా మూలిగింది. ఆలోచిస్తూ పెద్దన్నయ్య గది నుండి నడుస్తున్న వాడినల్లా ఆగిపోయాను.

"ఆయన నా పిల్లలకెప్పుడైనా బట్టలుగాని, పుస్తకాలుగాని కొనిచ్చాడా?" అంటున్న అన్నయ్య గొంతు.

"చాకిరీ చేస్తే పిడికెడు కూడు తప్ప ఏం సుఖముందీ కొంపలో" వదిన గొంతు. అక్కడినుంచి కదిలాను.

"డ్రస్ కుట్టించుకోవడానికి డబ్బులడిగితే లేవన్నాడు" ఇంకో గదిలో నుంచి రెండో అన్నయ్య.

"ఈ వ్యవసాయం ఎందుకు ఏదో ఒక జాబ్ మా వూళ్ళోనే చూసుకోరాదా?!" డిగ్రీ చదివిన రెండో వదిన.

వాళ్ళని చూస్తే నామీద నాకే విరక్తి కలిగింది.

మర్నాడు నేను రెండేళ్ళదాకా పెళ్ళి చేసుకోనన్న విషయం మీద చర్చ జరిగింది. ఆ తరువాతి రోజు రెండో వదినను పొరుగూరులోని వాళ్ళ నాన్నగారు పురిటి కోసం తీసుకువెళ్ళడానికి వచ్చారు. ఇది రెండో పురుడు కదా! మేమే పోస్తామన్నారు అమ్మా వాళ్ళు. అయినా తమ వూళ్ళోనే పురుడు పోసుకుంటానని పట్టుపట్టి బయలు దేరింది వదిన. అన్నయ్య కూడా వెంట వెళ్ళాడు. వారం రోజుల తరువాత ఉత్తరం వ్రాశాడు. తనకు అక్కడే ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం దొరికిందని, వారంలోగా వచ్చి తన సామాను తీసుకెళ్తానని వుందా ఉత్తరంలో. అమ్మా నేను, నాన్న బాధపడ్డాం.

వారం తిరక్కుండానే వేరుగా వెళ్ళిపోయిన అన్నయ్య స్కూటర్‌మీద వచ్చాడు. "ఇదెప్పుడు కొన్నావురా?" నాన్న అడిగినా సమాధానం సరిగా చెప్పకుండా దాటవేశాడు. అది చూసి పెద్దన్నయ్య, వదిన మొహాలు మాడ్చుకున్నారు. నా భయమల్లా ఒక్కటే. వీళ్ళందరూ వీళ్ళ చిరాకులు అమ్మమీద ప్రయోగిస్తారేమోనని. పెద్ద వదిన ఏదో అన్నది. చిన్న అన్నయ్య ఏదో అన్నాడు. చిన్న రభస జరిగింది.

ఇల్లంతా ఉద్రిక్తతతో నిండిపోయింది. వాడివరకు వాడు ఏమీ పట్టనట్లు సామాను తీసుకుని వెళ్ళిపోయాడు.

ఇన్నాళ్ళనుంచి ఎదురుచూస్తున్న మా చుట్టుప్రక్కల వారందరికీ ఇదొక చర్చనీయాంశం అయింది. ఈ సమయంలోనే మా వూరి పోస్టాఫీసులో ఎల్.డి.సి. ఉద్యోగం వచ్చింది. నా ఆనందానికి హద్దుల్లేవు. అందరికీ స్వీట్లు పంచాను. అమ్మా నాన్న బాగా సంతోషించారు. కనీసం మా సంతోషం కరిగిపో లేదు.

పెద్దన్నయ్య నాన్నతో చెప్తున్నాడు -

"పిల్లలు ఈ పల్లెటూర్లో సరిగ్గా చదువుల్లేక చెడిపోతున్నారు. నేను కూడా రోజూ ఇక్కడినుంచి గుంటూరు దాకా ఆఫీసుకు వెళ్ళి రావాలంటే కష్టమవుతోంది. అందుకని గుంటూరులో ఇల్లు తీసుకున్నాను. పిల్లల అడ్మిషన్లు కూడా తీసేసుకున్నాను." నాన్న అయోమయంగా చూశాడు. అమ్మ చాటుగా ఏడ్చింది.

పిల్లలను తీసుకుని వాళ్ళూ వెళ్ళిపోయారు. ఇల్లంతా మూగపోయింది. బాధ నిండిన మనసులతో మేం ముగ్గురం మిగిలిపోయాం. రోజులు గడుస్తున్నాయి. ఇంట్లో ఇంకా స్తబ్ధత ఆవరించి వుంది. ఈ నిశ్శబ్ధత అణిగిపోవాలి. ఎలా... ఏం చేయాలి? ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను.

వెంటనే అమ్మకు చెప్పాను. "అమ్మా! నేను పెళ్ళి చేసుకుంటాను."

నా మాటకు అమ్మ నవ్వింది.

"ఎందుకమ్మా! నవ్వుతున్నావ్?"


"నువ్వు పెళ్ళి చేసుకోనని చెప్పి ఈ ఇంట్లో అందరి మనస్థత్వాలు బయటపెట్టావురా! నీకు తెలీదు, నీకు పెళ్ళి కాకముందే ఈ ఇంట్లోంచి తప్పుకుంటే అందరూ వేలెత్తి చూపుతారని, పెద్ద మనుషుల్లా బయటపడాలని, నీకు పెళ్ళి చేయడానికి ప్రయత్నించారు. అప్పుడైతే తప్పంతా నీమీద, నీ భార్య మీద నెట్టేసి వాళ్ళు తప్పుకో

వచ్చనుకున్నారు. నువ్వు రెండేళ్ళదాకా చేసుకోనని చెప్పాక తప్పనిసరై వెళ్ళిపోయారు."

అమ్మ మాటల్లో యధార్థం తోచింది.

"వెళ్ళిపోయిన యిద్దరూ స్కూటర్లు కొన్నారు కదరా! మొన్నటివరకు తమలపాకులు తేవడానికి చిల్లర పైసలు కూడా లేనట్లు ప్రవర్తించారు" అంది కన్నీళ్ళతో.

అమ్మ నా తల నిమిరి చెప్పింది - "రఘూ! చిన్నవాడివని మేం చేసే గారాబానికి పొంగిపోయేవాడివి కదరా! నిజానికి నీకు గారాబం తప్ప ఏం మిగిలింది? ముందు పుట్టిన వాళ్ళందరూ కుటుంబం కోసమే కష్ట పడతారని చెప్తుంటారందరు. కాని, చిన్నవాడి చదువు పూర్తయి, పెళ్ళి చేసుకునే సరికి, ముందు వాళ్ళం దరికీ కోడళ్ళు, మనమళ్ళు, మనమరాళ్ళు, అల్లుళ్ళన్న ప్రేమతో ప్రతి తల్లి దండ్రులు అన్నీ ఘనంగా చేస్తారు.



"పండుగకు బట్టలు కొనాలన్నా ఒరే! అన్న పిల్లలు నీకన్నా చిన్నవాళ్ళు కదరా? వాళ్ళకు కొన్నాక, డబ్బు చూసుకుని నువ్వు కొనుక్కుందువుగాని అంటూ ప్రతి పండుగకి చిన్నవాడికి క్రొత్త బట్టలు లేకుండానే నడిపించేస్తారు. అన్నలు. వాళ్ళ జీతం డబ్బులతో వాళ్ళకి, వాళ్ళ భార్యలకి తెచ్చుకుంటారు. పిల్లలను తాతయ్య నడుగమని పంపుతారు. వాళ్ళు అడిగారని వాళ్ళకి కొనే సరికి చిన్నవాడికి డబ్బు సరిపోదు.

"ఇక చిన్నవాడికి, భార్యా పిల్లలకి పెట్టే సమయం వచ్చేసరికి తండ్రి రిటైరవుతాడు. పెద్దవాళ్ళు వేర్పాటు వాదం లేవదీసి విడిగా వెళ్ళిపోతారు. అందుకే చిన్నవాడికి గారాబం తప్ప ఏం మిగలదు. నువ్వు నీ అన్న పిల్లల మీద చూపించిన ఆప్యాయతాను రాగాలలో కొంచెమన్నా వాళ్ళదగ్గర్నుంచి నీ పిల్లలకు దక్కవురా. ఎందుకంటే అందరూ వేరుపడి వున్నారుగా.

"ఈ వేర్పాటు వాదంలో సమిధయ్యేది చిన్నవాడే. ఆ గారాబం మరో నింద కూడా తెచ్చిపెడుతుంది మాకు. చిన్నవాడికి చాటుగా అన్నీ అందజేస్తున్నామని. ఇదంతా అందరికీ వర్తిస్తుందని చెప్పనుగాని - మన కుటుంబం లాగే చాలా కుటుంబాలలో ఇలా జరుగుతుంది."

నా మనసు ద్రవించిపోయింది. మౌనంగా నా గదిలోకి వెళ్ళిపోయాను.

మర్నాడే అమ్మా నాన్న వెళ్ళి నా పెళ్ళి ఖాయపర్చుకొచ్చారు. అన్నయ్యల పెళ్ళిళ్ళకు నేనెంత హడావుడి చేశానో గుర్తొచ్చింది. ఇప్పుడు ఆ హంగామా ఏమీ లేదు. పెళ్ళి రేపనగా అన్నయ్యలు వచ్చారు. నా మనసు చిన్నబోయింది. పెళ్ళి అయిపోయిన మర్నాడే ఎటువాళ్ళు అటు వెళ్ళిపోయారు.

మొదటి రాత్రే నా భార్య "ఈ పల్లెటూర్లో మీరెలా వుంటున్నారండీ! బోర్‌గా వుండదూ" అనడిగింది. నాకు చాలా భయమేసింది. నా భావాలు మొహంలో ప్రతిబింబించాయేమో!

"పల్లెటూరైనా మీ వూరు చాలా బావుంటుందండీ! వాగులూ, కొండలు, చల్లనిగాలి, పొలాలు..." అంటూ పొగిడింది.

అమ్మయ్య!! అనుకున్నాను. తొందరలోనే అమ్మతో బాగా కలిసిపోయింది. ఇల్లంతా మళ్ళీ కళకళలాడుతున్నట్లనిపించింది.

నేను ఆనందంగా వుండటం దేవుడికి కూడా యిష్టం లేదేమో! నేను ఆఫీసుకెళ్ళగానే ఆఫీసరు పిలిచి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు చేతిలో పెట్టాడు.

"ఇదేంటి సార్!" అన్నాను అయోమయంగా.

"నీకు హైదరాబాదుకు ట్రాన్స్‌ఫర్ అయింది. కానీ, ఇంత త్వరగా నిన్ను ట్రాన్స్‌ఫర్ ఎందుకు చేశారో నాకర్థం కావట్లేదు" అన్నాడు.

ఇంటికి రాగానే విషయం చెప్పి అమ్మా వాళ్ళతో అన్నాను. "నేను అక్కడికి వెళ్ళను. కావాలంటే రాజీనామా చేసి, అన్నయ్య కౌలుకిచ్చిన పొలం చూసుకుంటాను." నాకు ఎంతో బాధగా వుంది.

"అదేంట్రా! అలా అంటావు, నువ్వు ఎక్కడున్నా సంతోషంగా వుండాలనుకుంటాంగాని, ఉద్యోగం లేకుండా మాదగ్గరే వుండాలని, నీ భవిష్యత్తు పాడు చేసుకోవాలని అనుకుంటామా! పిచ్చి పిచ్చి ఆలోచనలు మానుకొని వెళ్ళటానికి సిద్ధం కండి" అన్నది అమ్మ బాధను కనిపించనీయకుండా.

నా భార్య కూడా బాధపడుతూనే తయార య్యింది. వాళ్ళ బలవంతం మీద మేం రైలెక్కాము. అమ్మని, నాన్నని ఒంటరిగా వదిలి వెళ్ళాలంటే నా మనసు పిండేసినట్లున్నది.

రైలు కదిలిన తర్వాత, నా భుజం మీద ఒరిగిపోతూ నా భార్య అంది - "ఆ పల్లెటూర్లో వుండలేక నేను మా నాన్నకు ఉత్తరం రాశాను. అత్తయ్యగారు, మామయ్య గారు ఆ వూరిని, ఆ యింటిని వదిలి రారని నాకు తెలుసు. మనిద్దరమే హాయిగా వుండచ్చని వ్రాశాను. మా నాన్న తన పలుకుబడిని ఉపయోగించి మీకు ట్రాన్స్‌ఫర్ చేయించారు. ఇప్పుడు ఇంక ఏ అడ్డూ వుండదు, ఎవరి మాటా వినక్కర్లేదు. మన సంసారం మనం చేసుకోవచ్చు..." ఇంకా ఏదేదో చెబుతోంది. నాకివేం వినబడట్లేదు. నా గుండెల్లో గునపాలు దింపినట్లనిపిస్తోంది. నా భార్య ఇప్పుడు నాకు అందంగా కనబడట్లేదు. బాహ్య సౌందర్యం కాదు అంతః సౌందర్యం ముఖ్యమని ఎందుకన్నారో ఇప్పుడర్థమవుతోంది. నా తల్లిదండ్రులని తర్వాతైనా హైదరాబాద్ రప్పించుకుని నాదగ్గర ఉంచుకోగలనా. వారు అలవాటైన ఆ పల్లెటూరు విడిచి వస్తారా? వచ్చినా నా భార్య ప్రవర్తన ఎలా వుంటుందప్పుడు..."

"నే చెప్పేది వినకుండా ఏమిటండీ ఆలోచనలు" గారంగా అంటోంది నా అర్థాంగి.

"ఏమీ లేదు రేపటి మన గురించే... మన పిల్లల ప్రవర్తన ఎలా వుంటుందా అని" అన్నాను నిర్లిప్తంగా కిటికీలోంచి వెనక్కి కదులుతున్న చెట్లవైపు చూస్తూ.